

# జీవితాశయం

శ్రీ కొడంచ వాసుదేవరావు

రోటిస్త్రీలనొసటికుంకుమను చూచినప్పుడల్లా నాకదో విధమైన ఆనందము, ఆవేశము, ఈర్ష్య, కోపము గలుగుతుండేవి. ఆ కుంకుమ నన్నెల్లప్పుడూ ఆకర్షిస్తుండేది. సంవత్సరము క్రితమువరకూ నేనోక్షణమాత్రమైనా దాన్ని విడిచిపెట్టియుండలేదు, కాని ఆ తరువాతనోకొంత కాలంవరకు విడిచిపెట్టవలసి వచ్చింది. ఎందుచేతనంటే నేను విధవనయ్యాను. సామాన్యంగా ఈనావయసులోని స్త్రీలవైధవ్యానికి బాల్య వివాహాలుచేయించే సంఘముగాని—ధనాశాపరులైప తలితండ్రులుకాని కారణభూతులైయుంటారు మా భార్యా భర్తలదనుకూల దాంపత్యమే. రెండు సంవత్సరముల పాటు పండువెన్నెల రాత్రులు గడిపినవారమే. అంతలో ప్రపంచ యుద్ధంవచ్చింది. సైన్యంలోచేరినవారికిఏవేవోఇస్తామని చాటిన చాటింపులకు నాభర్తహృదయం ఆకర్షింపబడింది. ఒక రోజురాత్రి నాతో ఈ విషయాన్ని విపులంగాచెప్పి ఉద్దేశ్యాన్ని అడిగారు. వారి మాటలు వినగానే నాకు భయం వేసింది. కళ్లనుంచి రెండు నీటిబొట్లు రాలినవి. పది నిమిషాలవరకూ నేను మాట్లాడలేదు.

"ఏం చంద్రం?" అన్నారు.

"ఏం చెప్పను; మనం ధనవంతులం కాకపోయినా మీరేరోజుకారోజుసంపాదించే రూపాయి డబ్బులతో హాయిగా కాలం గడుపుతున్నాము. ఎందుకు లేనిపోని ఆశా సౌధాలునిర్మించటం; మీరు యుద్ధానికి వెళ్లడం నాకేమాత్రం ఇష్టంలేదు. నాకు చాలా భయంగాఉంది యుద్ధంఅంటే. అదీ గాక మీరు వెళ్తే నాగతి ఏమవుతుంది. నాకిప్పుడు ఐదోమాసం అని మీకుతెలుసు...." అని ఏమేమోచెప్పాను, అవి వారి చెవులకెక్కలేదు. కొండంత ఆశలతో నానోరు రింప చూశారుగాని లాభం లేకపోయింది. నేనూరికే ఏడుస్తున్నాను. వారికి కోపం వచ్చింది. "ఛీ ఛి- మన స్త్రీ లంతా ఇంతే- వారంతవారు తెలుసుకోలేరు- ఒకరు చెప్తే వినరు. ఉన్నదానికీ లేనిదానికీ ఏదోఒకటి ముందు పెట్టుకునివస్తారు;" అని మా స్త్రీల హృదయాలు తెలిసినవారిలా కోపంతో అన్నారు. ఆ మాటలకు నా హృదయం ఎలాగైనదో చెప్పలేను. నా హృదయాన్ని తెలిసికోలేకపోయారు గదా అని విచారించి కన్నీళ్లుతుడుచుకొని 'మీ ఇష్టం' అన్నాను. ఆ నామాటను ఊతగాతీసికొని- నా స్థితిగతులు తెలిసికొనకుండా సైన్యంలో చేరటానికి వెళ్లిపోయారు.

వారు సైన్యంలోచేరటానికి వెళ్ళిన తర్వాత ఓమూడు నెలలు వరుసగా ఆయన వద్దనుండి ఉత్తరాలూ- కొంతడబ్బూ వస్తుండేది: ఏమొస్తే ఏం ఆయనవద్ద లేనప్పుడు; అతి కష్టంతో ఆమూడునెలలూ గడిపాను. ఆ తరువాత ఆయనవద్దనుండిఏమీరాలేదు; నా కాతృత ఎక్కువయింది. పదేపదే ఉత్తరాలు వ్రాసినాను కాని లాభంలేకపోయింది. మనదేశంలోంచి కొంతసైన్యం ఈ మధ్యనే యుద్ధంచేయటానికి మరోదేశం వెళ్ళిందని వాళ్లువీళ్లు అంటున్న మాటలనుబట్టి, మావారా సైన్యంలో ఉంటారనీ- అందుచేత నా ఉత్తరాలకు జవాబురాలేదని తృప్తిపడ్డాను. మరో మాసానికి నాకో మగపిల్లవాడు- అచ్చంగా ఆయన పోలికే- పుట్టాడు. అతన్ని పోషించడానికి నేను పడ్డపాట్లు చెప్పలేను. కొన్నాళ్ళు పుట్టింట్లో ఉన్నాను. తన సంసారానికే చాలినంత సంపాదించలేని నాతండ్రి, నన్ను, చంటివాడిని ఎలా పోషిస్తాడు; అప్పటికీ అరు మాసాలాయనవద్దనే ఉన్నాను.

మూడు సంవత్సరాలు మూడు యుగాల్లాగాగడచినవి, యుద్ధం అయిపోయింది. సైన్యంలోచేరిన వారంతా తిరిగివస్తున్నారు. నాకు చాలా సంతోషంకలిగింది, చంటివాడిని చంకలోకిరికించి, నాకుమల్లే నేవచ్చిన వాళ్ళుకొంతమంది అక్కడ ఉన్నారు. రైలువచ్చి ఆగింది. ఒక పెట్టెలోంచి నలభై మంది దిగారు. కాళ్ళు పోయినవారు కొందరూ- చేతులు పోయినవాళ్ళు కొందరూ- కళ్లుపోయినవాళ్లు కొందరూ- తెల్ల మొహాలను నల్లగానూ, నల్ల మొహాలను తెల్లగానూ మార్చుకొన్నవాళ్ళు కొందరూ దిగారు. ఆ నలభై మందిలోకి ఏ నలుగురో అయిదుగురో

సరిగా ఉన్నారు. ఏ ఒక్కనిమొహాన్ని సంతోషంలేదు, తమతమ సంసారాల్ని చూచుకుని వారుగాని, వారినిచూచి సంసారాలుగాని ఏమాత్రం సంతోషించక కళ్ళ వెంబట నీళ్ళుకార్చినవి. ఆ వచ్చినవాళ్ళల్లో మా ఆయన ఎక్కడా కనపడలేదు. నాగుండె వేగంగా కొట్టుకోసాగింది. అతికష్టం మీద ఆవచ్చినవాళ్లలో మాకు దూరపుబంధువైన కోటాయిని గుర్తించి మావారి సంగతి అడిగాను. అడగటమే తడవుగా "ఇంకెక్కడి సూరాయి చంద్రం! నీకు తెలీదా ఏమిటి—యుద్ధంలో దెబ్బతగిలి అతనుపోయి రెండు సంవత్సరాలన్నరయింది. నేను నీకు ఉత్తరం వ్రాశానే అందలేదేమిటి?....వెధవ యుద్ధం" అని విసుగుగా మాట్లాడాడు. అంతే. అక్కడే ఆ చంటివాడితో కూలిపోయాను.........

అలా మావారి అత్యాశఫలితంగా నేను నా కుంకుమకు దూరమయ్యాను. నాస్థితిని చూచి తలగీత అని కొందరూ—కర్మ అని కొందరూ అనటం మొదలుపెట్టారు. నాకా మాటలువింటే కోపంవచ్చేది. కర్మట—తలగీతట—అవేంచేసినవి నన్ను! పిచ్చినమ్మకాలు వీరూను...............

ఇక నా ఆశాజ్యోతి ఆ చంటివాడే. వాడికోసం నేను జీవించాలి- సుఖపడ్తే ఏమైనా వాడివల్ల సుఖపడాలి. దగ్గరలో ఉన్న బస్తీ చేరి ఒక మిల్లులోచేరాను. ఆమిల్లుయజమాని చాలా మంచివాడిలా కనబడ్డాడు. ఏ లోజుకూలి ఆరోజు- పదణాలిచ్చి పంపేశేవాడు. ఓ పదేనురోజుల తర్వాత ఒకనాటి సాయంకాలం—అందరు కూలీలు వెళ్ళిన తర్వాత అతను నన్నుచూచి, "చంద్రం! నీ సంగతి నాకుతెలిసింది. ఎందుకు ఈ వయసులో అలా కష్టపడతావు? నిన్ను నేను పోషిస్తాను కాని, ఒక షరతుమీద........" అంటూ ఏదో అన్నాడు. నేను మాట్లాడలేకపోయాను, ఆరోజు కూలీ డబ్బులతోవచ్చేసి ఆవీధి ప్రక్కనున్న చెట్టుక్రింద కూర్చుని ఆలోచించడం మొదలుపెట్టాను. నిజమే—అతడు నా శరీరాన్ని కోరటంలో తప్పులేదు. పద్దెనిమిదేళ్ళ వయసులోని-వెనుక ఏహంగూ లేనిస్త్రీని- కాస్త అందమైనదాన్ని చూచి ఏ మగహృదయం ఊరుకుంటుంది? నన్ను ఉంచుకుంటాడట- పోషిస్తాడట....మూడు సంవత్సరాలనుంచీ నా హృదయంలో ఆ ప్రేమ విషయకమైన సంగతి దాచిపెట్టబడి ఉంది. అంతకాలం దాన్ని నేను తలపెట్టలేదు. ఆరోజున నాకావెన్నెల రాత్రులన్నీ జ్ఞాపకానికి వచ్చినవి. ప్రపంచంఅంతా-నేనొక్కతను తప్ప- సుఖం కోరుతున్నది, జీవితాశయమైన ఆ సౌఖ్యాన్ని నేను మాత్రం ఎందుకు వదలుకోవాలి! కళ్ళుతెరచి చూచాను చంటివాడు ప్రక్కనలేడు. అటూ ఇటూ చూచాను. రోడ్డుమీదఉన్నాడు. త్వరగా లేచి తీసుకొద్దామని బయలుదేరినాను. ఎదుటినుంచి కారొకటి వేగంగావస్తున్నది. వచ్చేసింది- చంటివాడి వద్దకువచ్చేసింది. అమ్మో ....నా చంటి....

క్రిందపడ్డనా కయిదు నిమిషాలదాకా తెలివిరాలేదు. లేచి చూతునుగదా మా చంటి అమ్మా అమ్మా అంటూ రోడ్డుమీదినుంచి వస్తున్నాడు, నా కళ్లను నేను నమ్మలేదు. కళ్లు నలుముకొని చూచాను. నాచంటే, రోడ్డుమీద కారాగిఉంది. దానివద్దకు వెళ్ళి చూచాను. డ్రైవరుముందు సీట్లమీద పడుండి అబ్బా—అబ్బా అంటున్నాడు. నొసటినుండి రక్తంకార్తోంది. చీరనుంచి గుడ్డ ముక్కను చింపి కట్టుకట్టాను....మరో ఐదు నిమిషాలకతనికి తెలివివచ్చింది, "అలా పిల్లవాడిని రోడ్డుమీద వదలుతావు టమ్మా! సడెన్ బ్రేకు వేశానుగాని లేకపోతే ఏమైనాఉందా! బ్రేకు ఫలితంచూచావా....నీ ఉపచారానికి నాకృతజ్ఞత" అని వెళ్లిపోయాడు. ఆ సాయంకాలపు రెండు సంఘటనలూ నన్ను చాలాసేపు వేధించినవి.

తలవని తలంపుగా ఆ మరునాడా డ్రైవరు నాకళ్ళపడ్డాడు. నేనే అతన్ని పలుకరించాను. దెబ్బ నయమా?' అని 'ఆ చాలావరకునయం' అని నిట్టూర్పు విడిచాడు. అతని మోహం వాడిఉంది. 'ఏం అలాగున్నా? రన్నాను. "ఏం చెప్పను! నిన్నటి సంఘటనవల్ల నా ఉద్యోగం పోయింది. కారు కొద్దిగా చెడింది దానికా కారు యజమాని నన్ను తిట్టి- నేను జరిగినదాన్ని చెప్పినా వినక- కళ్ళు నెత్తిమీద పెట్టుకొని నడుపుతున్నానని ఉద్యోగం నుంచి తీసివేశాడు" అని చెప్పాడు. నావల్లకదా అతని పనిపోయిందని విచారించాను, ఆమాటా ఈమాటా సందర్భంలో నా చరిత్ర అంతా అతనికితెలిసింది. అంతావిన్న తర్వాత అతడు, "నేను చాలా అదృష్టవంతుణ్ణి. ఆలోజులలో నన్నుకూడా సైన్యములోచేరమని నా స్నేహితులు కొంతమంది బలవంతపెట్టారు. వెళ్దామనిపించింది కాని నా ముసలితల్లి ఏడ్పులవల్ల ఆగిపోయాను" అన్నాడు, "మీ రెంతమంచివారు!" అని అప్రయత్నంగా అన్నాను, పదినిమిషాల వరకూ ఎవరమూ మాట్లాడలేదు, నా చంటి క్రిందనుంచొని అతని బట్టనిలాగటం మొదలుపెట్టాడు. అతన మాంతంగా చంటి నెత్తుకొని ముద్దుపెట్టుకొని "చంద్రం! నీకు ఎవరూలేరు. నాకూ నాతల్లి తప్ప ఇంకెవరూలేరు, నీతో ఓ విషయం మాట్లాడతాను, కోపించుకోవు కదా?" అని అన్నాడు. "నాకు కోపం అనేది ఎప్పుడూలేదు. మీరు చెప్పదలచుకొన్నదేదోచెప్పండి" అన్నాను, "నిన్ను నేను నాభార్యగా అంగీకరించటానికి ఏమీ వెనుదీయను. నీ వెటువంటిదానివయినా నాకు ఫరవాలేదు. కల్మషంలేనివారెవరూ ప్రపంచంలో ఉండబోరు. నేను ఇంతవరకు ఏ స్త్రీనీ నిన్ను కోరినట్లుగా కోరలేదు, ఏదో విధంగా కామతృప్తిని పొందేవాడిని నిన్ను చూచిన తర్వాత నాలో ఏదోచెప్పరాని మార్పు వచ్చింది. నాకు నీవో జ్యోతిలాగా ఉన్నావు. నీలో ఏదో ఒహామహత్తు- నా తల్లికి ఉన్నటువంటిది ఉన్నదని నా నమ్మకం నీ రాకకు నాతల్లి ఏమాత్రం అడ్డుచెప్పదు.........

చంటినెత్తుకొని అతను ముందు పోతుంటే నేనతని వెనకాలే పోతున్నాను.